సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 19 । మే । 2023



అంతా అస్తవ్యస్తం
ధారూరులో రైతు వేదిక, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణం ఒకే చోట ఏర్పాటు చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. 8లో▸



ట్యాంకర్ దొంగల పట్టివేత
డీజిల్ ట్యాంకర్‌ను దొంగలించిన దుండగులను పట్టుకున్నామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం వివరాలు వెల్లడించారు. 8లో▸



అభివృద్ధి పనులకు నిధులు
అభివృద్ధి పనులకు అడిగినన్ని నిధులు ఇస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరం ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్కూల్ ప్రత్యేక అధికారి స్రవంతి తెలిపారు. తెలుగు మీడియంకు సంబంధించి ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఉపాధ్యాయులు టి.భాగ్యలక్ష్మి 89852 05242, జి.రాధిక 97036 48404 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో 160 సీట్లు

పూడూరు: పదో తరగతి పాసైన విద్యార్థులు స్థానిక మోడల్ స్కూల్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘ఇంటర్ సిటీ’ పాస్‌లకు ఎంపీ ఆర్థిక సాయం



ట్రైన్ పాస్‌ల కోసం అవసరమైన నగదు అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మర్పల్లి: బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేందుకు అవసరమైన పాస్‌ల కోసం ఎంపీ రంజిత్‌రెడ్డి రూ.2.40 లక్షలు అందజేశారు. మర్పల్లి రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వంద మంది విద్యార్థులు నగరానికి వెళ్తారు. మర్పల్లి స్టేషన్‌లో ఇంటర్ సిటీ రైలు నిలుపుతున్నందున వీరి సౌకర్యార్థం పాస్‌లు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నగదును గురువారం జెడ్పీటీసీ మధుకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల మాజీ చైర్మన్ మల్లేశం తదితరులు ఉన్నారు.

నిరాదరణకు గురైతే ఫిర్యాదు చేయండి



వెబ్ పోర్టల్ కరదీపికను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ అశోక్ కుమార్ తదితరులు

తాండూరు టౌన్: నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు తాండూరు ఆర్డీఓ అశోక్ కుమార్ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేతావత్ లలిత కుమారితో కలిసి గురువారం తన కార్యాలయంలో వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల సంరక్షణ పట్ల నిర్లక్ష్యం వహించే పిల్లలపై నేరుగా సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టం వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్, లేదా సమీపంలోని ఆన్‌లైన్ కేంద్రాలు లేదా 14567 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏఓ సుధ, తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, ఆర్ఐ రాజారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు నిర్మల, రాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రానీయొద్దు

దోమ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తహశీల్దార్ షాహెదబేగం సూచించారు. మండల పరిధిలోని గుండాల్, దాదాపూర్ సెంటర్లను గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గన్నీ బ్యాగులకు కొరత లేకుండా చూడాలని తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆమె వెంట ఆర్ఐ లింగం, సర్పంచులు సుజాత, కృష్ణ, నిర్వాహకులు గురుచరణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మీర్జాపూర్ సర్పంచ్ సాబెరాబేగం కన్నుమూత

పూడూరు: మండల పరిధిలోని మీర్జాపూర్ సర్పంచ్ సాబెరాబేగం(60) గుండెపోటుతో మృతిచెందారు. మూడు నెలల క్రితం అస్వస్థతకు గురైన ఆమె ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో విషాదం అలుముకుంది.

బృహత్ కళ



వికారాబాద్ జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

ఆహ్లాదం పంచే దిశగా మెగా పార్కులు
- మండలానికి ఐదు చొప్పున కేటాయింపు
- 71 చోట్ల పనులు దాదాపు పూర్తి

వికారాబాద్: జిల్లాలోని బృహత్ ప్రకృతి వనాలు ఆహ్లాదం పంచే దిశగా రూపు దిద్దుకుంటున్నాయి. ఏడాదిన్నర క్రితమే వీటి అభివృద్ధికి బీజం పడినా అనుకున్న స్థాయిలో భూములు దొరకక, ఆయా శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపం కారణంగా జాప్యం జరుగుతూ వచ్చింది. ఆరు నెలలుగా ఈ విషయంలో కలెక్టర్, డీఆర్డీఓ ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ప్రకృతి వనాల పనులు వేగం పుంజుకున్నాయి. ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తయ్యాయి.

మండలానికి ఐదు చొప్పున

పచ్చదనం పెంచేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే జిల్లాలో 715 పల్లె ప్రకృతి వనాలు.. పట్టణాల్లో పట్టణ ప్రకృతి వనాలు, అర్బన్ పార్కుల ఏర్పాటుతో ముందుకు సాగుతోంది. వీటికి తోడు మండలానికి ఐదు చొప్పున జిల్లావ్యాప్తంగా 95 బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు కేవలం ఒకటి రెండెకరాల విస్తీర్ణంలో ఉండగా.. బృహత్ పార్కులను ఎనిమిది నుంచి పదెకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

సమష్టిగా పనులు

బృహత్ వనాలను బహుల ప్రయోజనకరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా స్థల పరిశీలన బాధ్యతలను రెవెన్యూ శాఖ, వనాల అభివృద్ధిని మండల పరిషత్, ఉపాధి హామీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పార్కులో ఏ మొక్కలు నాటాలి..? ఎన్ని మొక్కలు నాటాలి..? తదితర అంశాలపై ఫారెస్ట్ అధికారులు టెక్నికల్ సపోర్ట్ అందజేస్తున్నారు. పార్కుల్లో ప్రజలు సేదతీరేందుకు కుర్చీలు, చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. బృహత్ పార్కుల్లో మొదటి ఏడాది మొక్కలు నాటడం, పెంచడం, రెండో ఏడాది వనాల అభివృద్ధి, వసతుల కల్పన చేపట్టాలని నిర్ణయించారు. అయితే శాఖల మధ్య నెలకొన్న సమన్వయలోపంతో పనులు మందగిస్తున్నాయి.

16.30 లక్షల మొక్కలు నాటేలా..

జిల్లాలో మొత్తం 95 బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని, స్థలం అందుబాటులో ఉంటే మండల కేంద్రాలకు సమీపంగా లేదంటే ఏదో ఒక చోట వీటిని అభివృద్ధి చేస్తారు. ఒక్కో పార్కులో 7,500 నుంచి 9వేల వరకు మొత్తం 16.30 లక్షల మొక్కలు నాటేలా ప్లాన్ చేశారు. ఇందులో ఇప్పటి వరకు 8,66,368 మొక్కలు నాటడం పూర్తయింది. 89 చోట్ల భూమి గుర్తించగా.. 87 చోట్ల గ్రౌండింగ్ పూర్తయింది. ఇప్పటివరకు 71 బృహత్ ప్రకృతి వనాలు పూర్తి చేశారు.

“ఈ సీజన్‌లో పూర్తి చేస్తాం..



జిల్లాలోని అన్ని మండలాల్లో దాదాపు స్థల పరిశీలన పూర్తయింది. ఇప్పటికే 70 శాతానికి పైగా బృహత్ ప్రకృతి వనాల గ్రౌండింగ్ పూర్తి చేశాం. కొన్ని చోట్ల భూ సేకరణ ఇబ్బందిగా మారింది. ఈ ఏడాది వర్షాకాలంలో అన్ని పార్కుల్లో పనులు ప్రారంభిస్తాం. ఇందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నాం.

– కృష్ణన్, డీఆర్‌డీఏ పీడీ

స్పష్టమైన ‘లిస్ట్’ ఇవ్వాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- ఓటరు జాబితాపై తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్



వికారాబాద్ అర్బన్: ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓ అశోక్‌కుమార్, ఆయా మండలాల తహసీల్దార్లతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు లిస్ట్ నుంచి తొలగించిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే నివేదిక అందజేయాలని సూచించారు. ఈ పనుల కోసం బూత్ స్థాయి అధికారుల సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన పనులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఆరుగురు కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించి, మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని తెలిపారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

- ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దు
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం తగదని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల ఆదేశించారు. ఈ మేరకు శానిటేషన్ సిబ్బంది, జవాన్లతో గురువారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని పలు చోట్ల పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. శానిటేషన్ విషయంలో పట్టణ వాసులకు అసౌకర్యం కలగకుండా చూడటంతో పాటు, మున్సిపల్ పరిధిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త సేకరణ, తరలింపు విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం కనిపించకూడదని సూచించారు. చెత్త, మురుగు రహిత పట్టణంగా వికారాబాద్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొయినొద్దీన్, సిబ్బంది రాజేందర్‌రెడ్డి, జవాన్లు వినోద్, చెన్నయ్య, రాజు, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా పట్టణంలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ పరిశీలించారు. సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యత పాటించాలని సూచించారు. ఆమె వెంట టీఆర్‌ఎస్ నేత చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్, కౌన్సిలర్ చందర్‌నాయక్, సిబ్బంది రాజేందర్‌రెడ్డి, నాగేందర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో ఆరుగురు డీఎంహెచ్‌ఓలు

- జీహెచ్‌ఎంసీ జోన్ల వారీగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- మరింత తగ్గనున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధి
- పర్యవేక్షణ సులభతరం చేసేందుకే అంటున్న ప్రభుత్వం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆరు జోన్లకు ఆరుగురు డీఎంహెచ్‌ఓలను నియమించాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి ఈ నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీలో శేర్‌లింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్ జోన్లు ఉన్నాయి. వీటి ఆధారంగా డీఎంహెచ్‌ఓ పోస్టులను క్రియేట్ చేయనున్నట్లు ప్రకటించింది. తద్వారా ఆయా ప్రాంతాల్లోని బస్తీవాసులకు సత్వర వైద్య సేవలు అందించడంతో పాటు విపత్తుల సమయంలో క్లోజ్ మానిటరింగ్‌కు అవకాశం ఉంది. కొత్తగా ఎంపికైన డీఎంహెచ్‌ఓలు ఇకపై జోనల్ కమిషనర్లకే రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

తగ్గనున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖల పరిధి..

ప్రస్తుతం హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ పరిధిలో 91 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 166 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, మరో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలన్నీ హైదరాబాద్ పరిధిలోకి వెళ్లనున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 36 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. వీటిలో 12 తప్ప మిగిలినవన్నీ కొత్త డీఎంహెచ్‌ఓల పరిధిలోకి రానున్నాయి. ఇప్పటి వరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలు.. ఇకపై జోన్ డీఎంహెచ్‌ఓల పరిధిలోకి రానుండటంతో ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ పరిధి మరింత తగ్గనుంది.

అవసరమైతే ఆత్మాహుతి దాడులు!



- హైదరాబాద్–భోపాల్ మాడ్యుల్స్‌ని రెచ్చగొట్టిన అజ్ఞాతవాసి
- సలీమ్, యాసిర్ ఫోన్ల నుంచి ప్రసంగాల ఆడియోలు రికవరీ
- వాటిలో ఫిదాయీన్ దాడులకు సంబంధించిన పలు అంశాలు
- వీటిని పంపింది ఎవరో గుర్తించే పనిలో కేంద్ర నిఘా వర్గాలు
- నేటితో ముగియనున్న 16 మంది ఉగ్రవాదుల పోలీస్ కస్టడీ

సాక్షి, సిటీబ్యూరో: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు హైదరాబాద్–భోపాల్‌ల్లో అరెస్టు చేసిన 16 మంది ఉగ్రవాదుల కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు చేయడానికి సిద్ధమవుతున్న ఈ మాడ్యుల్స్‌కు విదేశాల నుంచి ఆదేశాలు అందుతున్నట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ప్రధాన సూత్రధారులుగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం, భోపాల్ వాసి యాసిర్ ఖాన్ సహా ముగ్గురి నుంచి రికవరీ చేసిన ఫోన్లను ఏటీఎస్ అధికారులు విశ్లేషించారు. ఈ నేపథ్యంలోనే అవసరమైతే ఆత్మాహుతి దాడులు చేయడానికి సిద్ధమవ్వాలంటూ వీరికి ఆదేశాలు అందినట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్ల నుంచి 50 ఆడియోలు రికవరీ..

ఏటీఎస్ అధికారులు హైదరాబాద్‌తో పాటు భోపాల్‌లో అరెస్టు చేసిన 16 మందినీ న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే సిటీలో చిక్కిన అయిదుగురితో పాటు భోపాల్‌లో అరెస్టు అయిన యాసిర్ ఖాన్‌ను నగరానికి తీసుకువచ్చి సీన్ రీ–కన్‌స్ట్రక్షన్ చేసి వెళ్లారు. ఈ ఉగ్రవాదులు సమాచార మార్పిడి కోసం రాకెట్ చాట్, త్రీమా యాప్స్ వినియోగించారు. ఎప్పటికప్పుడు వాటిలోని డేటాను డిలీట్ చేశారు. ఈ కారణంగానే వీరి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో కీలకమైన సమాచారం లభించలేదు. దీంతో వీటిని విశ్లేషించడానికి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. గోల్కొండలో నివసించిన భోపాల్ వాసి మహ్మద్ సలీం, భోపాల్‌లోని షాజహానాబాద్‌కు చెందిన యాసిర్‌తో పాటు మరో ఉగ్రవాది ఫోన్లను విశ్లేషించిన ఫోరెన్సిక్ నిపుణులు వాటి నుంచి కొంత డేటాతో పాటు 50 ఆడియో ఫైల్స్ రికవరీ చేశారు. ఈ ఆడియోల్లోనే ఆత్మాహుతి దాడులకు సంబంధించిన ప్రస్తావన ఉన్నట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు.

టూ వే కమ్యూనికేషన్ ఉన్నప్పటికీ...

ఈ ఆడియోల్లో ప్రసంగించిన వ్యక్తి ఒకేసారి అనేక మందిని చంపడం (మాస్ కిల్లింగ్), సెబోటేజ్ (విధ్వంసాలు సృష్టించడం), ఎంపిక చేసుకున్న వ్యక్తులను హతమార్చడం (టార్గెట్ కిల్లింగ్) అంశాలతో పాటు ఆత్మాహుతి (ఫిదాయీన్) దాడులు సంబంధించిన అంశాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మూడు ఫోన్ల నుంచి రికవరీ చేసిన డేటాలో టూ వే కమ్యూనికేషన్‌ను గుర్తించారు. అంటే ఈ ఉగ్రవాదులతో పాటు వీరికి ఆదేశాలు, సలహాలు సూచనలు ఇచ్చే వ్యక్తికి సంబంధించిన సందేశాలూ రిట్రీవ్ అయ్యాయి. అవి ఎవరు పంపారనేది మాత్రం ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించలేకపోయారు. ఆ వివరాలు కేవలం యాప్‌లోనే నిక్షిప్తమై ఉంటాయని నివేదిక ఇచ్చారు. దీంతో అవతలి వ్యక్తులను గుర్తించడం కోసం కేంద్ర నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. మరోపక్క వీరి ఫోన్లకు కొన్ని పాకిస్థాన్ నంబర్ల నుంచి కాల్స్ వచ్చినట్లు, కాంటాక్ట్స్ లిస్టులోనూ ఆ దేశం నంబర్లు ఉన్నట్లు ఏటీఎస్ చెబుతోంది. అవి ఎవరివి? వారితో వీరికి ఉన్న సంబంధాలేంటి? అనే కోణంలో ఆరా తీస్తోంది.

కొన్ని ఆడియోల్లో కఫీల్ అహ్మద్ ప్రస్తావన..

ముగ్గురు ఉగ్రవాదుల ఫోన్ల నుంచి రిట్రీవ్ చేసిన ఆడియోల్లో లండన్‌లోని గ్లాస్గో విమానాశ్రయంపై 2007లో మానవ బాంబు దాడికి ప్రయత్నించిన బెంగళూరు వాసి, వృత్తిరీత్యా డాక్టర్ అయిన కఫీల్ అహ్మద్ ప్రస్తావన ఉన్నట్లు ఏటీఎస్ గుర్తించింది. ఇతడి సోదరుడు నబీల్ అహ్మద్‌ని సైతం ఎన్ఐఏ అధికారులు 2012లో ఢిల్లీలో అరెస్టు చేశారు. లష్కరే తొయిబా (ఎల్‌ఈటీ) సంస్థ కోసం ఉగ్రవాదులను రిక్రూట్ చేస్తున్నట్లు ఇతడిపై అభియోగాలు ఉన్నాయి. కఫీల్ అహ్మద్ హిజ్బ్ ఉత్ తెహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ తరఫునే మానవబాంబుగా మారాడు. హైదరాబాద్–భోపాల్ మాడ్యూల్ ఉగ్రవాదులూ తొలినాళ్లలో అదే ఉగ్రవాద సంస్థ తరఫున పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఆ ఆడియోలు హెచ్‌యూటీ హ్యాండ్లర్‌గా భావిస్తున్నారు. మరోపక్క ఏటీఎస్ విచారిస్తున్న 16 మంది పోలీసు కస్టడీ గడువు శుక్రవారంతో ముగియనుంది. మరో ఐదు రోజులు అదనపు కస్టడీ కోరాలని ఏటీఎస్ భావిస్తోంది. ఈ కేసులో మరో ముగ్గురు నగర వాసులను సాక్షులుగా చేరుస్తున్నారు. వీరి నుంచీ వాంగ్మూలాలు నమోదు చేయనున్నారు.

‘పల్లెప్రగతి’తో పంచాయతీలకు మహర్దశ

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్

కడ్తాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతితో గ్రామాలు, పల్లెలు, తండాల రూపురేఖలు మారాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ పి.రవీందర్ అన్నారు. రానున్న వర్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా కడ్తాల్‌లో జరుగుతున్న కార్యక్రమాన్ని గురువారం డీపీవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల గురించి సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం తగదని.. తడి, పొడి చెత్తను సేకరించి వేరు చేయాలన్నారు. వాటితో ఎరువులు తయారు చేసుకోవచ్చని, తద్వార పంచాయతీలు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సూచించారు. అనంతరం రైతువేదిక, పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, వైకుంఠ ధామాలను సందర్శించి పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

సాగుకు సై..



తాండూరు మండలంలో ట్రాక్టర్‌తో పొలంలోని పత్తి కట్టెను తొలగిస్తున్న రైతు

- వానాకాలం సీజన్‌కు చురుగ్గా ఏర్పాట్లు
- విత్తనాలు, ఎరువుల సేకరణపై వ్యవసాయ శాఖ దృష్టి
- అకాల వర్షాలు కురవడంతో పొలాలు చదును చేసిన కర్షకులు
- ‘తొలకరి’ పలకరించగానే విత్తనాలు వేసేందుకు సిద్ధం

తాండూరు: వానాకాలం పంటలకు వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జూన్ 4న నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని, ఈ సీజన్ సాధారణ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సేకరణపై దృష్టి సారించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులంతా ఇప్పటికే పొలాలను చదను చేసుకుని, దుక్కులు దున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే హలం పట్టుకొని పొలం బాట పట్టేందుకు రెడీగా ఉన్నారు.

పత్తి, కంది అధికం

జిల్లాలోని 20 మండలాల్లో 5.84 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వానాకాలం పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.ప్రధానంగా పత్తి, కంది, వరి, మొక్కజొన్న, పెసర, మినుము ఎక్కువగా వేస్తారని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు. 74,683 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచనున్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాధార పంటలు అధికంగా సాగవుతాయి. తేలిక పాటి భూముల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం, నల్ల రేగడి నేలల్లో 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

పొలం బాట పట్టిన రైతులు..

వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లోని పాత పంటల అవశేషాలను తొలగించడం, సేంద్రియ ఎరువులు తరలించడం, మేకలు, పశువుల మందలు వేయడం వంటివి చేస్తున్నారు.

తగ్గిన పప్పు దినుసుల సాగు

జిల్లాలో పప్పు దినుసుల సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. జిల్లాలోని తాండూరు ప్రాంతంలో పండించే కంది పంటకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. తాండూరు కంది పప్పునకు భౌగోళిక గుర్తింపు లభించినప్పటికీ.. సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలేవీ తీసుకోవడం లేదు. మరోవైపు పెసర, మినుము పంటల సాగు కూడా పడిపోతోంది.

సాగుకు అవసరమైన విత్తనాల వివరాలు..

విత్తనం	పంట విస్తీర్ణం	క్వింటాళ్లలో
వరి	95,690	23,922
కంది	1,51,824	6,072.29
మొక్కజొన్న	54,322	2,716.1
మినుము	5,252	315.12
పెసర	12,690	761.4
సోయాబీన్	2,999	899
పత్తి	2,55,980	5,11,960 (ప్యాకెట్లు)
ఇతర పంటలు	5,560	-

రసాయన ఎరువులు మెట్రిక్ టన్నుల్లో..

యూరియా	28,867
డీఏపీ	15,360
ఎంఓపీ	6,206
కాంప్లెక్స్	21,899
ఎస్ఎస్‌పీ	2,351

“ఇబ్బందులు రానివ్వం



జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి 5.84 లక్షల ఎకరాల పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కానివ్వం. వర్షాలు కురవక ముందే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతాం. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్లు, వ్యాపారుల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి.

– గోపాల్, డీఏఓ

క్లుప్తంగా

21న విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

కొడంగల్‌ రూరల్‌: నియోజకవర్గంలోని వివిధ సబ్‌ స్టేషన్ల పరిధిలో ఆదివారం మరమ్మతు పనులు నిర్వహించే క్రమంలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌కుమార్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132 కేవీ కొడంగల్‌ సబ్‌స్టేషన్‌లో ఉదయం 8.30 నుంచి 10.30గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

నకిలీ విత్తనాలను అరికట్టండి



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్‌ అర్బన్‌: నకిలీ విత్తనాలు, మందులను అరికట్టాలని వైఎస్సార్‌ టీపీ పరిగి నియోజకవర్గ కోఆర్డినేటర్‌ కోళ్ల యాదయ్య, జిల్లా అధికార ప్రతినిధి వసంత్‌కుమార్‌ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్లు, మండలాల వారీగా ఎరువులు, విత్తనాలపై అధికారుల పర్యవేక్షిం చాలన్నారు. నకిలీ విత్తనాలను రహస్యంగా విక్రయిస్తున్నారని అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఫెర్టిలైజర్‌ దుకాణాల లైసెన్స్‌లపై విచారణ చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతుల్లో చైతన్యం తేవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు జాకబ్‌, వెంకటేశ్‌, రాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

బైక్‌ అదుపుతప్పి ఒకరి మృతి

మరొకరికి గాయాలు



బషీర్‌ (ఫైల్‌)

దోమ: బైక్‌ అదుపుతప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పాలేపల్లికి చెందిన ఆటోడ్రైవర్‌ బషీర్‌ (39) అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి అనే వ్యక్తితో బైక్‌పై కుల్కచర్ల మండల కేంద్రంలో ఓ శుభకార్యానికి బయల్దేరారు. తిరిగి వస్తున్న క్రమంలో మోత్కూర్‌ శివారులో బైక్‌ అదుపు తప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బషీర్‌ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విశ్వజన్‌ తెలిపారు.మృతుడికిభార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ గురువారం ఉదయం మృత దేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహులు, మని తదితరులు పాల్గొన్నారు.



రైతు వేదిక ఆవరణలోనే క్రీడా ప్రాంగణం సామగ్రి, చిత్రంలో భారీ గుంత



రైతు వేదిక పక్కనే చెత్త దగ్ధం

అధికారుల అనాలోచితం.. అంతా అస్తవ్యస్తం

ఒకే చోట రైతువేదిక, డంపింగ్‌ యార్డు, క్రీడా ప్రాంగణం

- 20 గుంటల స్థలంలోనే ఈ మూడు ఏర్పాటు
- స్థానికుల తీవ్ర అభ్యంతరం
- కలెక్టర్‌ చర్యలు చేపట్టాలని వేడుకోలు

ధారూరు: గ్రామంలో రైతు వేదిక, డంపింగ్‌ యార్డు, క్రీడా ప్రాంగణం ఒకే చోట ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తగిన స్థలాలను కేటాయించి ఏర్పాటు చేస్తే బాగుండేదని, ఉన్న కొద్ది స్థలంలో మూడింటిని ఏర్పాటు చేసి అవస్థలకు గురిచేస్తున్నారని వారు వాపోయారు. ఒక్కో దానికి అర ఎకరా అంటే సుమారు 20 గుంటల చొప్పున స్థలం ఉండాలనీ, మూడింటికీ కలిపి 20 గుంటల స్థలం కూడా లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నామ మాత్రంగా ఏర్పాటు చేసిన వీటి వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదని అంటున్నారు. డంపింగ్‌యార్డులో వస్తున్న చెత్తను దగ్ధం చేయడం వల్ల పొగ వ్యాపిస్తోందని, రైతు వేదికకు వచ్చిన రైతులకు, చుట్టు పక్కల వారికి పొగ ఇబ్బంది కల్గిస్తుందని వారు తెలిపారు. ఒక్కో దానికి అర ఎకరం చొప్పున కేటాయించాలనీ, రైతు వేదిక దగ్గర నుంచి డంపింగ్‌యార్డు, క్రీడా ప్రాంగణాన్ని వేరే చోటుకు మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్రీడలకు అనువైన చోటేది

నాగారంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం నామ్‌కే వాస్తేగా నిర్మించారని, ఆటలు ఆడేందుకు అనువైన స్థలం లేదని క్రీడాకారులు చెబుతున్నారు. రైతు వేదిక పక్కనే పెద్ద గుంత ఉందని, దాని పక్కనే నీటి గుంత ఉందని వారన్నారు. పక్కనే డంపింగ్‌ చేసిన చెత్తను దగ్ధం చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పెద్దేముల్‌: తప్పిపోయిన పిల్లలను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా దేవరకద్ర మండలం కొండ మల్లన్నపల్లికి చెందిన రాజు, కల్పన దంపతులు. వీరు పెద్దేముల్‌ మండలంలోని ఓ పొలం వద్ద కాపలా ఉంటున్నారు. గురువారం ఉదయం వీరు పొలంలోకి వెళ్లగా.. ఇద్దరు పిల్లలు నడుచుకుంటూ మూడు కిలో మీటర్ల దూరంలోని మారేపల్లి గేటు వద్దకు చేరుకున్నారు. హైదరాబాద్‌కు ఎటు వెళ్లాలి.. బస్సులు ఎప్పుడు వస్తాయి.. లారీలు ఉంటాయా అని అక్కడున్న రాఘవేందర్‌రెడ్డిని అడిగారు. ఆయనకు అనుమానం వచ్చి ఆరా తీశాడు. పిల్లలు సరైన సమాధానం చెప్పకపోవడంతో పెద్దేముల్‌ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. చిన్నారుల ఫొటోలను వాట్సాప్‌ గ్రూపుల్లో షేర్‌ చేశారు. దీంతో తల్లిదండ్రులు స్టేషన్‌కు వచ్చి పిల్లలను తీసుకెళ్లారు. గతంలో కూడా పిల్లలు ఇలాగే చేశారని రాజు కల్పన ఎస్‌ఐకి తెలిపారు. ఇక ముందు జాగ్రతగా ఉండాలని వారికి ఎస్‌ఐ సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి వేళ మండల పరిధిలోని బండవెల్కిచర్ల శివారులో రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు లేకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బొంరెడ్డిపల్లికి చెందిన దండు రామకృష్ణ, మెతుకు ప్రభాకర్‌ రెడ్డిలకు చెందిన రెండు ట్రాక్టర్లను సీజ్‌ చేయడంతో పాటు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విషాదం నింపిన సెల్ఫీ సరదా

చెరువులో మునిగి ఇద్దరు యువకుల మృతి

అబ్దుల్లాపూర్‌మెట్‌: సెల్ఫీ సరదా ఇద్దరు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. హైదరాబాద్‌ నగరంలోని బాగ్‌అంబర్‌పేట్‌ 6వ నంబర్‌ ప్రాంతానికి చెందిన మహమ్మద్‌ సోఫియాన్‌ హుస్సేన్‌ (18) వేసవి సెలవులు కావడంతో తుర్కయంజాల్‌లో నివాసం ఉండే తమ బంధువు సయ్యద్‌ అనాస్‌ (14) ఇంటికి వచ్చాడు. వీరిద్దరూ మరో ఇద్దరు యువకులతో కలిసి గురువారం మధ్యాహ్నం సంఘీనగర్‌లోని చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ సెల్ఫీలు దిగుతుండగా.. ప్రమాదవశాత్తు సయ్యద్‌ అనాస్‌ చెరువులో పడిపోయాడు. గమనించిన సోఫియాన్‌ వెంటనే చెరువులో దిగి అనాస్‌ను కాపాడేందుకు యత్నించాడు. చూస్తుండగానే ఇద్దరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్‌, ఫైర్‌ సిబ్బంది సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

మస్కట్‌ నుంచి వస్తూ దూప్‌చర్ల వాసి అదృశ్యం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని దూప్‌చర్లకు చెందిన బుడుగు లక్ష్మప్ప 2021 జనవరిలో మస్కట్‌ వెళ్లాడు. అక్కడ దవత్‌ మజాన్‌ కంపెనీలో పనిచేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తున్నాడు. ఇటీవల తిరిగి వస్తూ విదేశంలోనే తప్పిపోయాడు. విచారణ పేరుతో పోలీసులు, విదేశీయులుకానీ అదుపులోకి తీసుకున్నారా? ఏమయ్యారోనని కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్నారు. ఆచూకి తెలుసుకొని స్వదేశానికి పంపించే ప్రయత్నం చేయాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటయ్య (ఫైల్‌)

బషీరాబాద్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన స్థానిక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అల్లాపూర్‌కు చెందిన కాశా వెంకటయ్య(35) కొంత కాలం క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. గ్రామంలోనే ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఈనెల 6న ఉదయం ఇంటి నుంచి వెళ్లి నుంచి తిరిగి రాలేదు. దీంతో తండ్రి కాశా దేవదాస్‌ అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. గురువారం పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కొడంగల్‌ రూరల్‌: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఎక్సైజ్‌ పోలీసులు గురువారం పట్టుకున్నారు. మండల పరిధిలోని రావులపల్లి చెక్‌పోస్టు దగ్గర వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో కారులో 44లీటర్ల లిక్కర్‌ ఉన్నట్లు గుర్తించారు. కుల్కచర్ల మండలం అంతారం చెరువు ముందు తండాకు చెందిన లోకేశ్‌ చంద్రియ సేడం నుంచి తన గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నారు. లోకేష్‌ చంద్రియను అరెస్టు చేసి కారును సీజ్‌ చేసినట్లు అసిస్టెంట్‌ ప్రొహిబిషన్‌ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, కొడంగల్‌ ఎక్సైజ్‌ సీఐ సైదులు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌ ఎస్‌ఐ ఏ.సైదయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సిమ్‌కార్డుల కట్టడికి చర్యలు

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: నకిలీ సిమ్‌ కార్డుల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మొబైల్‌ షాపులు, సిమ్‌ కార్డుల రిజిస్ట్రేషన్‌ కేంద్రాలపైన స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా గురువారం ఎస్పీ కోటిరెడ్డి డిస్ట్రిబ్యూటర్స్‌, జిల్లాలోని మొబైల్‌ షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంఘ విద్రోహక శక్తులు, సైబర్‌ క్రైం నేరస్తులు, అపరిచిత వ్యక్తులకు ఫోన్స్‌, వీడియో కాల్స్‌ లాంటి మొదలగు నేరాలకు పాల్పడే నేరస్తులు ఎక్కువగా నకిలీ సిమ్‌కార్డులతోనే నేరాలు చేస్తున్నారన్నారు. నకిలీ కార్డుల కట్టడికీ అందుకు జిల్లాలోని ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అపరిచిత వ్యక్తులకు సిమ్‌కార్డులు ఇచ్చినా, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఆధారాలు లేకుండా సిమ్‌కార్డులు ఇచ్చిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్పీలు, సిమ్‌కార్డుల డిస్ట్రిబ్యూటర్స్‌, మొబైల్‌ దుకాణాల యాజమాను పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

- సీడీపీఓ కార్యాలయంలో రికార్డుల పరిశీలన
- అంగన్‌వాడీల పని తీరుపై అసంతృప్తి
- మల్‌రెడ్డిపల్లి అంగన్‌వాడీ టీచర్‌కు మెమో జారీ



రికార్డులను పరిశీలిస్తున్న మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

తాండూరు రూరల్‌: మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో ఉన్న సీడీపీఓ ఆఫీస్‌ను జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం కార్యాలయంలో ఉన్న రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. రికార్డులు ఇంటి వద్ద పెట్టుకొని సెంటర్లకు రావొద్దని టీచర్లను హెచ్చరించారు. రికార్డులు ఇంటి వద్ద ఉండటంపై పట్టణంలోని మల్‌ రెడ్డిపల్లి -3 సెంటర్‌ టీచర్‌కు మెమో జారీ చేయాలని ఇన్‌చార్జి సీడీపీఓ నిర్మలను ఆదేశించారు. అంగన్‌వాడీల నిర్వహణపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్‌ వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని వారిని మందలించారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై ఎందుకీ వివక్ష?

నిలదీసిన అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్‌: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తామని చెప్పిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్‌ వివక్ష చూపుతున్నారని అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి సాధనకోసం ఈ నెల 22న నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రొఫెసర్‌ జయశంకర్‌ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని కాళేశ్వరం పేరుతో రీడిజైన్‌చేసి రంగారెడ్డి జిల్లాకు గోదావరి నీళ్లు రాకుండా చేశారని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల్లోకి ప్రవేశిస్తున్న రాష్ట్రంలో ఈ రెండు జిల్లాపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ గత పదేళ్లలో అనేక సభల్లో పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని జాతీయ పథకంగా చేపడతామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. గత ఎన్నికల సమయంలో మూడేళ్లలోపు పూర్తి చేస్తామన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను సాధించే వరకు శాంతియుత, ప్రజాస్వామిక పద్ధతిలో ఆందోళన చేపట్టాలనే ఆలోచనతో ఈ నెల 22న మహాధర్నా చేపట్టినట్టు చెప్పారు. ధర్నాకు ప్రొఫెసర్‌ హరగోపాల్‌ హాజరు కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీర్లపల్లిశంకర్‌, ఎండీ ఇబ్రహీం, దొడ్డి శ్రీనివాస్‌, బుద్దుల జంగయ్య, రవీంద్రనాథ్‌, నర్సింలు, సత్యం, రవికుమార్‌, కృష్ణ, తిరుమలయ్య, రాజు, కృష్ణారెడ్డి, రఘు, తిరుపతిరెడ్డి, కొమ్ముకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్‌ అలీఖాన్‌, సీతారాం, సుదర్శన్‌, ఖదీర్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గుంతల మయంగా ఉన్న రోడ్డే కారణం

పరిగి: గుంతలమయంగా ఉన్న రోడ్డులో ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని నస్కల్‌ గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నస్కల్‌ గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌ పరిగి వైపు బైక్‌పై వస్తున్నాడు. గ్రామ శివారులో రోడ్డు గుంతలమయంగా ఉండటంతో బైక్‌ అదుపుతప్పింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. గుంతలమయంగా ఉన్న రోడ్డు కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అయినా ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.

అన్ని స్థానాల్లోనూ గెలిచితీరుతాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీ బలంగా ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాలనూ గెలిచి తీరుతామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం వికారాబాద్‌లోని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌ నివాసంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్‌ స్థానాల్లో లీడర్‌ షిప్‌ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఎల్‌డీఎం వికారాబాద్‌ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా చామల రఘుపతిరెడ్డిని నియమించినట్లు తెలిపారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా అధికారాన్ని హస్తగతం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ పాలనలో ధరణి సమస్యలు రైతులను పీడిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని ప్రకటించారు. దళితబంధు పథకం అమలులో ఎమ్మెల్యేలు కమీషన్లు తింటున్నారని స్వయంగా సీఎం కేసీఆరే ప్రకటించడం ఆయన పాలనకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల నుంచి అసైన్డ్‌ భూములను లాక్కుంటోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్డ్‌ భూములకు హక్కులు కల్పిస్తామన్నారు. రాజీవ్‌గాంధీ యూత్‌ ఆన్‌లైన్‌ క్విజ్‌ పోటీల్లో యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్‌ వెబ్‌ లింక్‌తో కూడిన ఎస్‌ఎంఎస్‌ను పొందడానికి సెల్‌ నంబర్‌ 76618 99899కు మిస్డ్‌కాల్‌ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌, యూత్‌ కాంగ్రెస్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సంతోష్‌కుమార్‌, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ సత్యనారాయణ, యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి, చిత్రంలో ప్రసాద్‌కుమార్‌ తదితరులు

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్‌ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. గతంలో ఆడపిల్ల పెళ్లి చేయాలంటే నిరుపేద కుటుంబంలో ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. కాని ఆడపడుచుల పెళ్లిళ్లను దర్జాగా చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందించడంతో దేశంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్‌ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌, రైతుబంధు కోఆర్డినేటర రాజేందర్‌ కౌన్సిలర్లు నాగేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్‌ ట్యాంకర్‌ దొంగల పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ



స్వాధీనం చేసుకున్న డీజిల్‌ ట్యాంకర్‌, కారు

- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

అనంతగిరి: డీజిల్‌ ట్యాంకర్‌ను దొంగలించిన దుండగులను పట్టుకున్నామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్‌ సీఐ వెంకటేశంలతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 14న రాత్రి సంగారెడ్డి జిల్లా కోహీర్‌ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న వెయ్యి లీటర్ల మినీ డీజిల్‌ ట్యాంకర్‌ను మార్గ మధ్యంలో మర్పల్లి మండలం మొగిలిగుండ్ల చౌరస్తా వద్ద నలుగురు వ్యక్తులు నల్లటి కారులోవచ్చి డ్రైవర్‌ను కొట్టి ట్యాంకర్‌ను అపహరించారు. దీంతో ఇస్నాపూర్‌కు చెందిన కృష్ణకుమార్‌రెడ్డి ఉదయం మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు టీంలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం మోమిన్‌పేట సీఐ వెంకటేశంకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పరిగిలోని కొడంగల్‌ చౌరస్తా వద్ద దాడి చేసి మహ్మద్‌ హమీద్‌, నడిమిదొడ్డి రాజులను పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడిందని ఎస్పీ తెలిపారు. మహ్మద్‌ ఫయాజ్‌, బాబులతో కలిసి నేరాన్ని చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. దీంతో నేరస్తులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. మహ్మద్‌ ఫయాజ్‌, బాబు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



భీమయ్య మృతదేహం

పరిగి: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఖుదావన్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్లొల్ల భీమయ్య (50) డీసీఎంఎస్‌ గోదాంలో హమాలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం బంధువుల పెళ్లి ఉండటంతో భార్య ఊరికి వెళ్లింది. దీంతో బీమయ్య ఇంట్లో పడుకున్నాడు. గురువారం ఉదయం చూస్తే విగతజీవిగా మారాడు. బీమయ్య చాతిభాగం, శరీరంపై గాయాలు ఉండటంతో భార్య పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాలు



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్మికులు

పరిగి: ఉచిత వైద్య శిబిరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జన్‌సాహస్‌ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్‌ ప్రకాశ్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో లేబర్‌ కార్డు ఉన్న కార్మికులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి హెల్త్‌ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 50 రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఏసీ జిల్లా కోఆర్డినేటర్‌ ఇమ్రాన్‌, సంస్థ ప్రతినిధులు వాజిద్‌ గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టోన్‌ క్రషర్లు, క్వారీలకు అనుమతివ్వం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టీకరణ



యాచారం: స్టోన్‌ క్రషర్లు, క్వారీలకు అనుమతి ఇచ్చే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మొండిగౌరెల్లిలోని సర్వే నంబరు 19లో 14 ఎకరాలకు పైగా ప్రభుత్వ గుట్టల్లో ఓ వ్యాపారి స్టోన్‌ క్రషర్‌, క్వారీ నిర్వహించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మొండిగౌరెల్లిలోని మెజార్టీ వర్గం స్టోన్‌ క్రషర్లు, క్వారీని వద్దని ఆందోళన చేస్తున్నారు. ఈ విషయమై స్టోన్‌ క్రషర్‌, క్వారీని వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చేదిలేదని ఎమ్మెల్యే వీరికి హామీ ఇచ్చారు.

మద్దతు దారులకు చీవాట్లు..

మొండిగౌరెల్లిలో స్టోన్‌ క్రషర్‌, క్వారీ నిర్వహించేలా వ్యాపారికి మద్దతుగా కొంత మంది పెద్దలు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ మీ స్టోన్‌ క్రషర్‌, క్వారీకి అనుమతిస్తే ఇంకా 18 వాటికి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అయినా వ్యవసాయ భూముల్లో ఆకుకూరలు, కూరగాయల పంటలు పండిస్తారని, స్టోన్‌ క్రషర్లు, క్వారీలు వస్తే దుమ్ము, ధూళికి వాతావరణ కాలుష్యం ఏర్పడటమేకాక, బోరుబావులు పూడుకుపోతాయన్నారు. మిమ్మల్ని కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే.. మొండిగౌరెల్లి గ్రామంలో స్టోన్‌ క్రషర్‌, క్వారీకి అనుమతి ఇచ్చేప్రసక్తేలేదని చెప్పిన ఎమ్మెల్యేకు ఆ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.